సాక్షి
గ్రేటర్ వరంగల్
(హనుమకొండ - వరంగల్)
బుధవారం । 27 । మార్చి । 2024



ఖాతాదారుల కష్టాలు

ఏనుమాములలోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లో ఏర్పాటు చేసిన ఎస్‌బీఐ సేవల్లో అంతరాయంతో ఖాతాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. - 8లో



రక్తదానం.. సామాజిక సేవ

రక్తదానం.. ఇతరులకు ప్రాణదానమని, ఇది సామాజిక సేవా కార్యక్రమమని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. - 8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం 38°/23°

జిల్లాలో ఉదయం నుంచి ఎండగా ఉంటుంది. మధ్యాహ్నం ఉక్కపోతతోపాటు వేడి పెరుగుతుంది. సాయంత్రం వేళ ఆహ్లాదకరంగా ఉంటుంది.

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
బుధ 6:35	గురు 4:51

న్యూస్‌రీల్

కాళేశ్వరాలయంలో సీపీ పూజలు



కాళేశ్వరం: జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలోని శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని వరంగల్ సీపీ అంబర్ కిశోర్ ఝా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. మంగళవారం ఆయన నిశి సమయంలో వచ్చి ప్రధాన మండపం వద్ద గణపతి పూజ చేసుకొని, అక్కడి నుంచి స్వామివారిని దర్శనం చేసుకున్నారు. అనంతరం శ్రీశుభానందదేవి అమ్మవారి ఆలయంలో పూజలు చేశారు. ఆశీర్వచన వేదిక వద్ద సీపీ దంపతులను స్వామివారి శేషవస్త్రాలతో సన్మానించి తీర్థప్రసాదం అందజేశారు. ఆయన వెంట కాళేశ్వరం ఎస్సై భవానిసేన్ ఉన్నారు.

పొలిటికల్ సైన్స్ విభాగం ఇన్‌చార్జ్ అధిపతిగా వెంకటయ్య



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పొలిటికల్ సైన్స్ విభాగం నూతన ఇన్‌చార్జ్ అధిపతిగా ఆవిభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్.వెంకటయ్య నియమితులయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ఎస్.నర్సింహాచారి మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇప్పటివరకు ఆ బాధ్యతలు నిర్వర్తిస్తున్న వీరస్వామి రాజీనామా చేశారు. దీంతో ఆ యన స్థానంలో వెంకటయ్యను నియమించగా, బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు.

నేడు కేయూ పాలకమండలి సమావేశం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పాలకమండలి సమావేశం బుధవారం సాయంత్రం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. ఈ నెల 30న యూనివర్సిటీ అకడమిక్ సెనెట్ సమావేశం, బడ్జెట్ ప్రవేశపెట్టనున్నారు. ఇందుకు సంబంధించి అర్థికపరమైన అంశాలపై పాలకమండలి సమావేశంలో, ఫైనాన్స్ కమిటీ సమావేశంలో చర్చించి ఆమోదించాల్సింటుంది. దీని కారణంగానే పాలకమండలి సమావేశం నిర్వహిస్తున్నట్లు సమాచారం. సమావేశంలో వీసీ తాటికొండ రమేష్, రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డితోపాటు సంబంధిత ఉన్నతాధికారులు పాల్గొననున్నారు.

14మంది గైర్హాజరు

విద్యారణ్యపురి: హనుమకొండ జిల్లాలో 68 కేంద్రాల్లో మంగళవారం నిర్వహించిన పదో తరగతి ఫిజికల్‌సైన్స్ పరీక్షలో 14 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ ఎండీ అబ్దుల్‌హై తెలిపారు. రెగ్యులర్ విద్యార్థులు 12,032మందికిగాను 12,018 మంది హాజరైనట్లు పేర్కొన్నారు. ప్రైవేట్ అభ్యర్థులు 210మందికిగాను 197మంది హాజరైనట్లు తెలిపారు. జిల్లా పరిశీలకులు నాలుగు, డీఈఓ, ఏసీజీ కలిసి ఐదు, ఫ్లయింగ్ స్క్వాడ్లు 14కేంద్రాలను తనిఖీ చేశారు.

వరంగల్ జిల్లాలో 15మంది..

కాశిబుగ్గ సెంటర్: వరంగల్ జిల్లాలో ఫిజికల్ సైన్స్ పరీక్షకు 15 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు డీఈఓ వాసంతి తెలిపారు. 9,523 మందికిగాను 9,508 మంది విద్యార్థులు హాజరైనట్లు పేర్కొన్నారు.

టెట్ దరఖాస్తు ఫీజు తగ్గించాలి

విద్యారణ్యపురి/న్యూశాయంపేట: ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు దరఖాస్తు ఫీజును భారీగా పెంపుదల చేశారని, ఆ ఫీజును తగ్గించాలని ఏబీవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ సయ్యద్ వలీఉల్లాఖాద్రీ మంగళవారం సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ ద్వారా కోరారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గతంలో టెట్ ఫీజుకింద ఒక పేపర్ రాసే వారికి రూ.200, రెండు పేపర్లు రాసేవారికి రూ.300 ఉండేదని పేర్కొన్నారు. ఇప్పుడు ఏకంగా పేపర్–1కి రూ.1000, రెండు పేపర్లకు రూ.2000లకు పెంచారని తెలిపారు. ఇది అభ్యర్థులకు భారం కానుందని తెలిపారు. రాష్ట్రంలో ఏడు లక్షలమంది నిరుద్యోగులను పరిగణనలోకి తీసుకొని, టెట్ ఫీజు తగ్గించాలని డిమాండ్ చేశారు.



వాల్వ్ లీకేజీ.. తాగునీరు వృథా

వరంగల్ దేశాయిపేట ఫిల్టర్‌బెడ్ నుంచి కాకతీయ కెనాల్ మీదుగా పలు విలీన గ్రామాలకు వెళ్లే ప్రధాన పైపులైన్ వాల్వ్ లీకేజీతో రెండు రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. నీటి కోతకు బ్రిడ్జిపై సిమెంట్, రాళ్లు లేచిపోయి ఇనుపరాడ్లు తేలి గుంతలమయంగా మారింది. అసలే ఎండాకాలం, అరకొర నీటి సరఫరా, వాల్వ్ లీకేజీని వెంటనే గుర్తించి అరికట్టకపోతే ఎలా? అంటూ బల్దియా ఇంజనీర్లపై నగరవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. – వరంగల్ అర్బన్

రిజిస్ట్రేషన్ల శాఖలో అక్రమ పోస్టింగులు!

జోనల్ నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు

- ఉమ్మడి వరంగల్‌లో పలుచోట్ల జరిగినట్లు ఆరోపణలు
- గత ప్రభుత్వ హయాంలో బదిలీలు, పోస్టింగ్‌లపై ఆరా
- త్వరలోనే రిజిస్ట్రేషన్ల శాఖలో తిరిగి ట్రాన్స్‌ఫర్లు?



వరంగల్ ఆర్వో కార్యాలయం

సాక్షిప్రతినిధి, వరంగల్: ప్రభుత్వ ఖజానాకు ప్రధాన ఆదాయ వనరుగా నిలుస్తున్న రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ శాఖను ప్రక్షాళన దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ఈ నేపథ్యంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖలో రెండేళ్ల కిందట జరిగిన జోనల్ బదిలీలు, పోస్టింగ్‌ల్లో అక్రమాలు వెలుగు చూస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఈ అక్రమాలు జరిగినట్లు అందిన ఫిర్యాదులపై స్పందించిన ప్రభుత్వం వీటిపైన విచారణకు ఆదేశించింది. ఈ క్రమంలో ఉమ్మడి వరంగల్‌లో 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాల పరిధిలో వివిధ కేడర్లలో జరిగిన నియామకాలపైనా విచారణ జరుగుతోంది. రెండేళ్ల క్రితం ఉమ్మడి వరంగల్ జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జోనల్ వ్యవస్థను ఉల్లంఘిస్తూ చేపట్టిన బదిలీలపై మార్పు చేర్పులు తప్పవని అధికారులు చర్చించుకుంటున్నారు. గ్రేడ్–1 స్థాయిలో గ్రేడ్–2 అధికారులను నియమించడంపై గతంలోనే రచ్చ జరిగింది. తాజాగా ప్రభుత్వం స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ ప్రక్షాళనకు సిద్ధం కాగా.. అక్రమ బదిలీలు, పోస్టింగ్‌ల వ్యవహారం ఆశాఖలోని అధికారుల్లో చర్చనీయాంశం అవుతోంది.

గ్రేడ్–1 స్థాయిలో.. గ్రేడ్–2 అధికారులు...

ఉమ్మడి వరంగల్ జిల్లాలోని 12 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉండగా వరంగల్ ఆర్వో, జనగామ, మహబూబాబాద్, డీఐజీ కార్యాలయంలో గ్రేడ్–1 స్థాయి అధికారులు విధులు నిర్వహిస్తారు. రెండేళ్ల క్రితం నాటి ప్రభుత్వం చేపట్టిన మల్టీజోన్, జోనల్ బదిలీల్లో జనగామ, మహబూబాబాద్‌కు గ్రేడ్–1స్థాయి అధికారులు, వరంగల్ ఆర్వోకు గ్రేడ్–2 స్థాయి అధికారులు వచ్చారు. వరంగల్ ఆర్వో కార్యాలయంలో జిల్లా రిజిస్ట్రార్ పర్యవేక్షణలో ఒక గ్రేడ్–1, ఒక గ్రేడ్–2స్థాయి సబ్ రిజిస్ట్రార్లు విధులు నిర్వహించాల్సి ఉండగా ఇద్దరూ గ్రేడ్–2 స్థాయి వారినే కొనసాగించడం బదిలీల్లో జోనల్ ఉల్లంఘన కనిపిస్తోందని ఆశాఖకు చెందిన వారే ఆరోపిస్తున్నారు. అదేవిధంగా ఉమ్మడి వరంగల్‌లో ఎక్కడ ఈ పరిస్థితి ఉందన్న కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. 12 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో వాస్తవానికి ఉండాల్సిన సిబ్బంది ఎంత? ప్రస్తుతం ఎంత మంది ఉన్నారు? రెండేళ్ల కిందట జరిగిన జోనల్ బదిలీల్లో ఇంకా ఎక్కడెక్కడ ఉల్లంఘనలు జరిగాయి? అన్న కోణంలో ఇంటెలిజెన్స్ ఆరా తీస్తుండటంపై ఆ శాఖ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

యువ ఓటర్లు ఓటుహక్కుపై చైతన్యపర్చాలి

- యూత్ పార్లమెంట్ సదస్సులో కలెక్టర్ సిక్తా పట్నాయక్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

రామన్నపేట: యువ ఓటర్లు చుట్టుపక్కల ఉన్న ఓటర్లను ఓటు హక్కు వినియోగించుకునేలా చైతన్యపర్చాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ కోరారు. మంగళవారం ములుగు రోడ్డులోని ఎల్బీ కళాశాలలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి 'నైబర్ హుడ్ యూత్–2024'ను నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ సిక్తా మాట్లాడుతూ ఒక్కో యువ ఓటరు 18 ఏళ్లు నిండిన కనీసం పది మందిని ఓటర్లుగా నమోదు చేయించేలా కృషి చేయాలన్నారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ మే 13వ తేదీన జరగనున్న లోక్‌సభ పోలింగ్ రోజున తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. అడిషనల్ కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ మాక్ పార్లమెంట్ ద్వారా విద్యార్థులు యువత ఎన్నో విషయాలు తెలుసుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, ప్రొఫెసర్ నీవన్‌కుమార్, జాతీయ అవార్డు గ్రహీత అకులపల్లి మధు, నెహ్రూ యువకేంద్రం జిల్లా యువజన అధికారి అన్వేష్, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు పాల్గొన్నారు.

పోలింగ్ అధికారుల ర్యాండమైజేషన్ పూర్తి

హన్మకొండ అర్బన్: లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనే పోలింగ్ అధికారుల మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తయినట్లు హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. మంగళవారం కలెక్టరేట్‌లో వివిధ శాఖ అధికారులతో ర్యాండమైజేషన్ ప్రక్రియపై కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బంది కేటాయింపు వివరాలతోపాటు, వారి మొదటి దశ శిక్షణ కార్యక్రమంపై చర్చించారు. ఈనెల 31, ఏప్రిల్ 1, 2 తేదీల్లో నగరంలోని కేడీసీ, పరకాల పాలిటెక్నిక్ కళాశాలల్లో శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాధిక గుప్తా, వెంకట్‌రెడ్డి, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, డీఆర్‌ఓ వైవీ గణేష్, ఎన్ఐసీ డీఐఓ విజయ్‌కుమార్, సీపీఓ సత్యనారాయణరెడ్డి, డీఐఈఓ గోపాల్, ఈడీఎం శ్రీధర్, కలెక్టరేట్ సూపరింటెండెంట్ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లాలో..

వరంగల్: పార్లమెంట్ ఎన్నికల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది మొదటి ర్యాండమైజేషన్ పూర్తి చేసినట్లు వరంగల్ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. కలెక్టరేట్‌లో అధికారులతో కలిసి ఎన్ఐసీ రూపొందించిన సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బంది మొదటి దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 106 వరంగల్ తూర్పు, 107 వర్ధన్నపేట, 103 నర్సంపేట అసెంబ్లీ నియోజకవర్గాల్లో 809 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన మొత్తం 4,338 మందిని మొదటి విడత ర్యాండమైజేషన్ ద్వారా కేటాయించినట్లు వెల్లడించారు.

కేసీఆర్‌ను కలిసిన కడియం కావ్య



హన్మకొండ: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావును మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఆ పార్టీ వరంగల్ పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. తనపై నమ్మకంతో అభ్యర్థిగా ప్రకటించినందుకు పుష్పగుచ్ఛం అందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించాలని కావ్యను కేసీఆర్ ఆశీర్వదించారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం

- భక్తులతో కిటకిటలాడిన 'ఎర్రగట్టు'



భక్తులకు మంగళసూత్రం చూపిస్తున్న అర్చకులు

హసన్‌పర్తి: హసన్‌పర్తి పరిధిలోని శ్రీఎర్రగట్టు వేంకటేశ్వరస్వామి కల్యాణం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి 11.48 గంటలకు వేదమంత్రోచ్ఛరణల మధ్య ప్రారంభమైన కల్యాణ తంతు మంగళవారం తెల్లవారుజామున 3గంటలకు ముగిసింది. వరంగల్ నగరంతోపాటు హసన్‌పర్తి మండలం, చుట్టుపక్కల గ్రామాలనుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరై కల్యాణాన్ని తిలకించారు. రెండవ రోజు మంగళవారం ఆలయం భక్తులతో పోటెత్తింది. స్వామివారి దర్శనం కోసం రెండుగంటల సమయం పట్టింది. రాత్రి చిన్న రథాల ప్రదర్శన ఆకట్టుకుంది. ఈ సందర్భంగా విశ్వక్సేన ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సంగారెడ్డి ఎస్పీ చెన్నూరి రూపేష్ దంపతులు ఎర్రగట్టు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ కిషన్‌రావు, ధర్మకర్తలు వెంకటస్వామి, సదానందం, కనపర్తి రాజు, వీంజమూరి రమణ, సురేష్, శైలజా, సంగాల ప్రశాంత్‌కుమార్, అటికం శ్రీనాథ్, సుమంత్‌యాదవ్, విశ్వక్సేన కమిటీ సభ్యులు పృథ్వీరాజ్, సంతోష్, కృష్ణమూర్తి, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి లీకేజీలపై వెంటనే స్పందించండి

ఎక్కడున్నా యుద్ధప్రాతిపదికన అరికట్టాలి

- 50 చోట్ల చలివేంద్రాలు ఏర్పాటు చేయాలి
- గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- నీటి సరఫరాపై అధికారులతో సమీక్ష



తాగునీటి సరఫరాపై సమీక్షిస్తున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ అర్బన్: తాగునీటి పైపులైన్లు, వాల్వ్‌ల లీకేజీల పట్ల సీరియస్‌గా స్పందించాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే.. ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం బల్దియా ప్రధాన కార్యాలయంలో వేసవిలో నీటి ఎద్దడి ఎదుర్కోవడానికి చేపట్టాల్సిన చర్యలపై నిర్వహించిన సమీక్షా సమావేశంలో కమిషనర్ పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లీకేజీలపై సమాచారం అందగానే వెంటనే స్పందించి అరికట్టేందుకు చొరవ చూపాలన్నారు. చివరి నల్లా కనెక్షన్ వరకు నీటి సరఫరా జరగాలన్నారు. కొత్త ప్రాంతాల్లో నీటి సరఫరాకు వాల్వ్‌ల బిగింపు ప్రక్రియ వేగంగా చేయాలన్నారు. లీకేజీలు తరచూ ఏర్పడడానికి కారణాలు ఏమిటని ఇంజనీర్లను ప్రశ్నించగా, నీటి అధిక ఒత్తిడితోపాటు పాత పైపులైన్లు, వివిధ అవసరాల కోసం రోడ్లు తవ్వడం వల్ల ఉత్పన్నమవుతున్నాయని చెప్పారు. వేసవిలో పాదచారులు, ఇతర పనుల కోసం బయటికి వచ్చే వారి దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాజీపేట సర్కిల్ పరిధిలో 25, కాశిబుగ్గ సర్కిల్ పరిధిలో 25 ప్రాంతాల్లో, ముఖ్యంగా జన సంచారం ఉన్న ప్రాంతాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు బీఎల్ శ్రీనివాస రావు, రాజయ్య, సంజయ్ కుమార్, శ్రీనివాస్, డీఈలు సారంగం, రవికుమార్, రవికిరణ్, రంగారావు, ఏఈలు పాల్గొన్నారు.

భవన నిర్మాణ అనుమతులపై పరిశీలన..

భవన నిర్మాణ ధ్రువీకరణ అనుమతుల కోసం సమోదైన దరఖాస్తులను కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మంగళవారం టౌన్ ప్లానింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరంగల్ ఆకుతోట కన్వెన్షన్ హాల్ ప్రాంతం, ఉర్సు గుట్ట సమీపంలో, ఖమ్మం రోడ్డు ఓల్డ్ బీట్ బజార్ ప్రాంతాల్లో పర్యటించి భవనాలు నిర్మించే స్థలాలు, డాక్యుమెంట్లు, ప్లాన్‌లను పరిశీలించారు. నిబంధనల మేరకు నిర్మాణ అనుమతులు జారీ చేస్తామని పేర్కొన్నారు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆమెవెంట సిటీ ప్లానర్ వెంకన్న, సీఎంహెచ్ఓ రాజేష్, టీపీఓలు సుష్మ, బషీర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంపత్ రెడ్డి తదితరులు ఉన్నారు.

నోడల్ అధికారులతో సమీక్ష

బల్దియా ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో వరంగల్ (తూర్పు) నియోజకవర్గ స్థాయి నోడల్ అధికారులతో మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఏఆర్ఓ, బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన విధి విధానాలు, చేపట్టాల్సిన చర్యల పట్ల కఠినంగా వ్యవహరించాలని పేర్కొన్నారు. సైబర్ సెక్యూరిటీకి సంబంధించి సీ విజిల్ యాప్, సువిధ లాగిన్‌లపై విషయ పరిజ్ఞానం కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ కమిషనర్ అనిసుర్ రషీద్, కుడా సీపీఓ అజిత్ రెడ్డి, సెక్రటరీ విజయలక్ష్మి, కృష్ణారెడ్డి, నందిరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగు అంతంతే..

హనుమకొండలో 5 వేల ఎకరాలకు 1,150 ఎకరాల్లో నాటిన మొక్కలు

- వరంగల్ జిల్లాలో 10 వేల ఎకరాలకు 2,050 ఎకరాల్లో..
- ఉపాధి హామీ పథకం సహకారం కరువు



నర్సరీలో సిద్ధంగా ఉన్న పామాయిల్ మొక్కలు

2022-23 ఆర్థిక సంవత్సరంలో సాగు ఇలా (ఎకరాల్లో)

జిల్లా	లక్ష్యం	సాగైంది
హనుమకొండ	2,220	1,150
వరంగల్	10,230	2,650
2023–24 ఆర్థిక సంవత్సరంలో..		
	5,000	1,150
	10,000	2,050

హన్మకొండ: పూర్వ వరంగల్ అర్బన్, రూరల్ జిల్లాల్లో ఆయిల్ పామ్ సాగు మందకొడిగా సాగుతోంది. 2023–24 ఆర్థిక సంవత్సరం ముగుస్తున్నా.. లక్ష్య సాధనలో ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖకు ఎదురీత తప్పడం లేదు. రెండు జిల్లాల్లో కలిపి ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 15 వేల ఎకరాలకుగాను 3,200 ఎకరాల్లో సాగు చేశారు. గత ఆర్థిక సంవత్సరంలో రెండు జిల్లాల్లో కలిపి.. 12,450 ఎకరాల్లో సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకుని 3,800 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. మొత్తం నాలుగేళ్లలో హనుమకొండ జిల్లాలో.. 14 వేల ఎకరాల్లో, వరంగల్ జిల్లాలో 57.795 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేయాలని నిర్ణయించుకున్నారు. ఇప్పటికే రెండేళ్లు ముగిసిపోగా, మరో రెండేళ్లలో లక్ష్యాన్ని చేరుకోవడం కష్టతరంగానే కనిపిస్తోంది.

నర్సరీల్లో మొక్కల పెంపకం..

పామాయిల్ తోటల సాగుకు ముందుగానే.. ఆయిల్ ఉత్పత్తి చేసే కంపెనీలను ప్రభుత్వం గుర్తించగా.. నర్సరీల్లో మొక్కలు పెంచారు. పామాయిల్ తోటలు సాగు చేసిన నాలుగేళ్లకు పంట చేతికొస్తుంది. పంట చేతికొచ్చేలోపు ఫ్యాక్టరీని నెలకొల్పి ఆయిల్ ఉత్పత్తికి సిద్ధం చేస్తారు. వరంగల్ జిల్లాకు రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్, హనుమకొండకు కేఎన్.బయోసైన్సెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ఎంపికయ్యాయి. ఈ కంపెనీలు నర్సరీలో మొక్కల పెంచుతున్నాయి. జిల్లాలో ఎంపిక చేసిన లక్ష్యాన్ని నాలుగేళ్లలో పూర్తి చేయాల్సి ఉంది. కానీ, ఆశించిన మేర సాగు అవడం లేదు. ముందుగా పామాయిల్ నాటిన రైతులు మొగి పురుగు సోకి.. చెట్లు ఎదగక ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు శ్రమ అధికంగా ఉండడంతోపాటు పంట దిగుబడి వెంటనే రాకపోవడం, లాభసాటి ఫలితాలు కనిపించడం ఆలస్యం కానుండడంతో రైతులు ముందుకు రావట్లేదని భావిస్తున్నారు.

సమన్వయ లోపం..

హనుమకొండ జిల్లాలో కేఎన్.బయోసైన్సెస్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్ ఖిలా వరంగల్ మండలం తిమ్మాపూర్‌లో నర్సరీని ఏర్పాటు చేసి మొక్కలు పెంచుతోంది. సంగెం మండలం లోహిత రాంచంద్రాపూర్‌లో రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ నర్సరీలో మొక్కలు పెంచుతున్నారు. ఇలా.. జిల్లాకు నిర్దేశించిన లక్ష్యానికి సరిపడా మొక్కలు పెంచుతున్నారు. ప్రస్తుతం కేఎన్.బయో సైన్సెస్ కంపెనీ నర్సరీలో 2,40,000 మొక్కలు, రాంచరణ్ ఆయిల్ ఇండస్ట్రీస్ నర్సరీలో 3,47,935 మొక్కలు సిద్ధంగా ఉన్నాయి. రైతులకు ఖర్చులు ఆదా చేసేందుకు గ్రామీణ ఉపాధి హామీ.. పథకంలో మొక్కలు నాటడానికి గుంతలు తీసే అవకాశం కల్పించారు. పలు మండలాల్లో ఉపాధి హామీ పథకం అధికారులు, ఉద్యోగుల నుంచి సహకారం లభించడం లేదని రైతులు చెబుతున్నారు. ఉద్యాన శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ మధ్య పరస్పర సహకార లోపం కనిపిస్తోంది. ఆసక్తి ఉన్న రైతులు గ్రామీణ ఉపాధి హామీ అధికారుల వద్దకు వెళ్తే.. ఉద్యాన శాఖ అధికారులను కలవాలని, ఉద్యాన శాఖ అధికారులను కలిస్తే.. తాము మొక్కలు ఇవ్వడంతో పాటు డ్రిప్ సౌకర్యం కల్పిస్తామని, గుంతలు ఉపాధి హామీ పథకం అధికారులు చూసుకుంటారని చెబుతూ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటున్నారని రైతులు వాపోతున్నారు.

రాయితీ.. రుణాలు

ఆయిల్ పామ్ మొక్కలపై ఒక్కో మొక్కకు రూ.193 రాయితీని ప్రభుత్వం అందిస్తుండగా.. రైతు తన వాటాగా రూ.20 చెల్లించాలి. ప్రభుత్వం ఎకరా మొక్కలపై రూ.11,600 రాయితీని అందిస్తోంది. ఎరువులపై ఎకరానికి రూ.2,100 రాయితీని అందిస్తోంది. బిందు సేద్యంపై ఎస్సీ, ఎస్టీలకు వందశాతం, సన్న చిన్న కారు, బీసీ రైతులకు రూ.90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీని అందిస్తోంది. బిందు సేద్యం పరికరాల విలువ ఒక హెక్టార్లు రూ.53,465, ఒక ఎకరానికి రూ.21,386లు ఖర్చు చేస్తున్నారు.

రూ.27.91లక్షల ఆస్తిపన్ను చెల్లింపు



ఆస్తిపన్ను చెక్కును అందజేస్తున్న డీఎం

వరంగల్ అర్బన్: ఆర్టీసీ హనుమకొండ డిపో బల్దియాకు బకాయి పడిన ఆస్తిపన్ను రూ.27.91లక్షలు చెల్లించారు. మంగళవారం హనుమకొండ డిపోలో బల్దియా డిప్యూటీ కమిషనర్ గొడిశాల రవీందర్ గౌడ్‌కు డిపో మేనేజర్ మోహన్‌రావు చెక్ అందజేశారు. డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలోని గృహాల యజమానులు, ప్రభుత్వ అధికారులు తమ ఆస్తులకు సంబంధించిన పన్ను బకాయిలను ఈ నెల 31 లోపు చెల్లించాలన్నారు. వడ్డీలో 90 శాతం రిబేట్ అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ అధికారి యూసుపుద్దీన్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీకాంత్, బిల్ కలెక్టర్లు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు

- హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్



మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

హన్మకొండ అర్బన్: వేసవికాలం దృష్ట్యా నగరంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని హనుమకొండ కలెక్టర్ సిక్తా పట్నాయక్ అధికారులకు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో తాగునీటి సరఫరాపై సమ్మర్ యాక్షన్ ప్లాన్, వార్షిక నిర్వహణపై జీడబ్ల్యూఎంసీ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రేటర్ పరిధిలో తాగునీటి సరఫరాకు ఎలాంటి అంతరాయం లేకుండా అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. తాగునీటి సరఫరా, నిర్వహణకు సంబంధించిన మెయింటెనెన్స్ మెటీరియల్, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. హనుమకొండ, కాజీపేట ప్రాంతాల్లో కార్పొరేషన్ ఆధ్వర్యంలో చలివేంద్రాలు, అవసరమైన చోట్ల ట్యాంకర్లను ఏర్పాటు చేయాలన్నారు. జీడబ్ల్యూఎంసీ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రాధిక గుప్తా, ట్రైనీ కలెక్టర్ శ్రద్ధాశుక్లా, జీడబ్ల్యూఎంసీ నీటి సరఫరా విభాగం ఎస్ఈ ప్రవీణ్ చంద్ర, ఈఈలు కె.రాజయ్య, శ్రీనివాస్, డీఈలు సంతోష్, రవికుమార్, శివానంద్ పాల్గొన్నారు.

నేడు రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ రాక

కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్, వరంగల్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్(ఆర్‌పీఎఫ్)పోలీస్ స్టేషన్‌లను బుధవారం దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఐజీ కమ్ ప్రిన్సిపల్ చీఫ్ సెక్యూరిటీ కమిషనర్ అరోమ సింగ్ ఠాకూర్ తనిఖీ చేయనున్నట్లు మంగళవారం ఆర్‌పీఎఫ్ పోలీస్ అధికారులు తెలిపారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లను సిద్ధం చేసి, సిబ్బందిని అప్రమత్తం చేసినట్లు పేర్కొన్నారు.



దుగ్గొండి మండలం గిర్నిబావి నుంచి జాతరకు వెళ్తున్న కాంగ్రెస్ ప్రభలు



బీఆర్ఎస్ ప్రభలను కొమ్మాలకు తీసుకెళ్తున్న నాయకులు



నర్సంపేటలో ప్రభబండ్లను ప్రారంభిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్



సీపీఎం ప్రభ ఎదుట విన్యాసాలు చేస్తున్న డప్పు కళాకారులు

'కొమ్మాల'లో రాజకీయ ప్రభల జోరు ..

వరంగల్ జిల్లా గీసుకొండ మండలంలోని కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి జాతర రాజకీయ రంగు పులుముకుంది. ఈసారి అధికారులు అనుమతి ఇవ్వడంతో పలు పార్టీల శ్రేణులు పోటాపోటీగా మంగళవారం ప్రభలను తీసుకొచ్చాయి. నర్సంపేట, పరకాల అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని పలు గ్రామాల నుంచి కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్, సీపీఎం నాయకులు, కార్యకర్తలు జెండాలు, ఫ్లెక్సీలు కట్టి ప్రభలను తరలించారు. నినాదాలతో హోరెత్తించారు. దీంతో మచ్చాపురం నుంచి లక్నెపల్లి వరకు ప్రధాన రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి.

- నర్సంపేట/దుగ్గొండి/గీసుకొండ

సాగులో మెళకువలు పాటించాలి

మహబూబాబాద్ రూరల్ : రైతులు వివిధ రకాల పంటల సాగులో మెళకువలు పాటించాలని, తద్వారా అధిక దిగుబడులు లభిస్తాయని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం సీడ్ రీసెర్చ్ అండ్ టెక్నాలజీ సెంటర్ డైరెక్టర్ పి.జగన్మోహన రావు అన్నారు. విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని విత్తన పరిశోధన సాంకేతిక విభాగం సహకారంతో మహబూబాబాద్ మండలం మల్యాల కృషి విజ్ఞాన కేంద్రంలో మంగళవారం వివిధ పంటల్లో విత్తన ఉత్పత్తిపై శిక్షణ నిర్వహించారు. వరి, కంది, వేరుశనగ, ఇతర పంటల్లో నాణ్యమైన విత్తన ఉత్పత్తిపై శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేరుశనగ పంటలో విత్తన ఉత్పత్తి, రకాల లభ్యత, విత్తే దూరం అంశాలపై వివరించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కే.సుకుమార్.. వరి పంటలో పాటించాల్సిన మెళకువలు వివరించారు. సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ వి.స్వర్ణలత మాట్లాడుతూ విత్తన ఉత్పత్తి రైతులు కందిలో నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి చేసి సహరైతులకు అందించాలన్నారు. మల్యాల కేవీకే సమన్వయకర్త డాక్టర్ ఎస్.మాలతి మాట్లాడుతూ పంటల్లో చీడపీడల యాజమాన్యంపై తెలియజేశారు.

దరఖాస్తు గడువు పెంపు

న్యూశాయంపేట: తెలంగాణ మైనారిటీ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్–1 ఉచిత శిక్షణ కోసం దరఖాస్తు గడువును వచ్చే నెల 9వ తేదీ వరకు పొడగించినట్లు ఉమ్మడి వరంగల్ జిల్లా నోడల్ అధికారి, హనుమకొండ జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి మేన శ్రీను మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 45 రోజులు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ ద్వారా శిక్షణ అందిస్తామని తెలిపారు. అర్హులై ఆసక్తి గల మైనారిటీ అభ్యర్థులు తమ దరఖాస్తులు హనుమకొండ సుబేదారి కలెక్టరేట్ కాంప్లెక్స్ 2వ అంతస్తులో గల కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వివరాలకు 7330990322 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

సినీ ఫక్కీలో చోరీ..

- పార్క్ చేసిన కారు అద్దాలు ధ్వంసం
- రూ.2లక్షల నగదు ఎత్తుకెళ్లిన దుండగులు



బాధితుడు ప్రతాప్‌రెడ్డి

జనగామ : పార్క్ చేసిన కారు అద్దాలు పగులగొట్టి రూ.2 లక్షల నగదు ఎత్తుకెళ్లిన ఘటన మంగళవారం జిల్లా కేంద్రంలో జరిగింది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. దేవరుప్పుల మండలం కడవెండి గ్రామానికి చెందిన తుమ్మ ప్రతాప్‌రెడ్డి పట్టణంలోని సిద్దిపేట రోడ్డు ఐసీఐసీఐ బ్యాంకులో రూ.2 లక్షల నగదు డ్రా చేసుకున్నాడు. అక్కడ నుంచి బయలుదేరగా.. ద్విచక్ర వాహనంపై ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు వెంబడించారు. ఆర్టీసీ చౌరస్తాకు చేరుకునే లోపు రెండుసార్లు కారులో ఉన్న వ్యక్తిని పిలుస్తూ... వాహనం నుంచి ఆయిల్ కారుతుందని చెప్పే ప్రయత్నం చేశారు. హైదరాబాద్ రోడ్డులోని పెట్రోలు బంకు వద్దకు వెళ్లిన తర్వాత, ఇంజిన్ చెక్ చేసుకుని ఆయిల్ కారడం లేదని నిర్ధారించుకున్నారు. కారులో పెట్రోలు పోయించుకుని.. సమీపంలో ఉన్న ఐడీబీఐ బ్యాంకుకు వెళ్లారు. ఇద్దరు వ్యక్తులు కారును వెంబడించారు. అనంతరం బ్యాంకు ఎదుట పార్క్ చేసిన కారు అద్దాలు పగుల గొట్టి, అందులో ఉన్న రూ.2 లక్షల నగదును ఎత్తుకెళ్లారు. బ్యాంకులో పని ముగించుకుని కారు వద్దకు వచ్చిన ప్రతాప్‌రెడ్డి ధ్వంసమైన అద్దాలను చూసి ఆందోళనకు గురయ్యారు. కారులో నగదు ఉన్న బ్యాగు లేకపోవడంతో వెంటనే పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. కాగా, జనగామ నడిబొడ్డున జరిగిన ఈ ఘటనతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. పోలీసు కంట్రోల్ రూమ్ సమీపంలో ఈ ఘటన జరగడం గమనార్హం. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ రఘుపతిరెడ్డి తెలిపారు.



ఖాతాదారుల కష్టాలు..

ఏనుమాముల ఎస్‌బీఐలో సేవలు కరువు

- ఇద్దరు అధికారులపైనే నిర్వహణ భారం
- ఇబ్బందుల్లో రైతులు, వ్యాపారులు, మహిళాసంఘాల సభ్యులు
- ఉన్నతాధికారులు దృష్టి సారించాలని వినతి

వరంగల్: ఏనుమాములోని వరంగల్ వ్యవసాయ మార్కెట్‌లోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో వినియోగదారులకు సేవలు కరువయ్యాయి. రైతులు, వ్యాపారులు, ఈప్రాంతంలోని ప్రజలకు సేవలు అందించేందుకు మార్కెట్ కమిటీ సూచనలతో 2000 సంవత్సరంలో ఎస్‌బీహెచ్ తన బ్రాంచ్‌ను ప్రారంభించింది. ఇందుకుగాను బ్యాంక్‌కు కావాల్సిన భవనం కూడా మార్కెట్ కమిటీ నిర్మించి ఇచ్చింది. బ్రాంచ్ ప్రారంభ సమయంలో వినియోగదారులకు త్వరతగతిన సేవలు అందించేందుకు కావాల్సిన అధికారులు, సిబ్బందిని నియమించడంతో వ్యాపారులు బ్యాంకులో తమ ఖాతాలు తెరిచారు. కాల క్రమంలో బ్యాంకులో వ్యాపారుల ఖాతాలు 300 నుంచి 400 వరకు ఉండగా సేవింగ్ బ్యాంక్ అకౌంట్లు సుమారు 30వేల వరకు ఉన్నాయి. 14వ డివిజన్ పరిధిలోని ఏనుమాముల, సుందరయ్యనగర్, బాలాజీనగర్, ఇందిరమ్మ కాలనీ 1, 2, ముసలమ్మకుంట, మధురానగర్, లక్ష్మీపతిగణపతి కాలనీ, సాయిగణేష్‌కాలనీ, ఎస్ఆర్‌నగర్ తదితర కాలనీల్లోని మహిళా సంఘాలు(ఎస్‌హెచ్‌జీ)కూడా ఈబ్యాంకులోనే ఖాతాలు తీస్తారు. మార్కెట్‌లో పంట ఉత్పత్తులు విక్రయిస్తే వెంటనే డబ్బులు జమ చేసుకునేందుకు పరకాల, ఆత్మకూరు, నర్సంపేట తదితర ప్రాంతాలకు చెందిన వ్యాపారులు, రైతులు ఇక్కడ ప్రత్యేకంగా ఖాతాలు తీసుకున్నారు. అయితే ఖాతాలు పెరిగినా బ్యాంకు ఉన్నతాధికారులు ఈబ్రాంచ్‌పై శీతకన్ను వేశారు. కేవలం ఇద్దరు ముగ్గురు అధికారులను నియమించారు. వారిలో కూడా ఒకరు ఎప్పుడు లీవ్‌లోనే ఉండడం లేదా వేరే బ్రాంచ్‌లో విధులు నిర్వహిస్తున్నట్లు తెలిసింది. ఈబ్యాంకులోని మేనేజర్, క్యాషియర్ ఇద్దరే నలుగురి పనులు చేస్తుండడంతో సేవలు అందడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఏనుమాముల బ్రాంచ్ అంటేనే అధికారులు భయాందోళనకు గురవుతున్నట్లు తెలిసింది. ఇందులో విధులు నిర్వర్తించడం అంటే పనిష్మెంట్ అనే భావన ఉద్యోగుల్లో వచ్చినట్లు సమాచారం. ఈ బ్యాంకుకు మేనేజర్‌గా వచ్చిన అధికారి ఏడాది కూడా ఉండలేని పరిస్థితులు నెలకొన్నాయని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. ప్రతి నెల మొదటి వారం వచ్చిందంటే మహిళా సంఘాల ప్రతినిధులతో బ్యాంకు కిటకిటలాడుతుంది. డబ్బులు జమ చేయాలంటే రెండు, మూడు గంటల సమయం పడుతోంది. ఆధార్ అప్‌డేట్, కేవైసీ లాంటి మార్పులు చేసుకోవాలని రెండు, మూడు రోజులు పనులు బంద్ చేసి బ్యాంకు చుట్టూ ప్రదక్షిణలు చేయాల్సి వస్తోందని పలువురు ఖాతాదారులు వాపోతున్నారు.

జమ అయితేనే డబ్బు చెల్లింపులు...

బ్యాంకులో వినియోగదారులు జమ చేస్తే తప్ప పెద్ద మొత్తంలో డబ్బులు చెల్లింపులు చేయలేని పరిస్థితుల్లో బ్రాంచ్ నడుస్తోంది. వ్యాపారులు ఎక్కువ తమ ఖాతాల్లో నుంచి ఆన్‌లైన్‌లో చెల్లింపులు చేయిస్తుండడంతో నగదు కావాల్సిన వారు వేచి చూడాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. మంగళవారం ఉదయం ఓ వ్యాపారి బ్యాంకు వచ్చి రూ.5 లక్షలు కావాలంటే మధ్యాహ్నం ఒంటి గంటకు చెల్లించారు. అదే మరొకరికి రూ.3లక్షలు.. మధ్యాహ్నం 2గంటలకు చెల్లింపులు జరిగాయి. ఇదేంటని అడిగితే అధికారులు తాము ఏం చేయలేమనే సమాధానం ఇస్తున్నారు. ఇక్కడ సేవలు ఆలస్యమవుతుండడంతో వ్యాపారులు సూచనలతో ఇటీవల జంక్షన్‌లో ఓ ప్రైవేటు బ్యాంకు ప్రారంభించారు. అయితే ఇక్కడ సరిపడ అధికారులను నియమించి మెరుగైన సేవలు అందిస్తేనే ఈబ్యాంకులో ఖాతాలు కొనసాగిస్తామని పలువురు వినియోగదారులు పేర్కొంటున్నారు.



ఏనుమాముల మార్కెట్ ఆవరణలోని బ్యాంకు

సేవలు లేవు..



మార్కెట్‌లోని రైతులతో పాటు ఈప్రాంత ప్రజలు, వ్యాపారుల కోసం బ్రాంచ్‌ను ఏర్పాటు చేసినప్పటికీ సేవలు అందడం లేదు. బ్యాంక్‌కు రావాలంటే భయంగా ఉంది. ఎప్పుడు పని అవుతోందో తెలియని పరిస్థితి నెలకొంది. వ్యాపార నిమిత్తం పీఓఎస్ మిషన్లు ఇచ్చి తీసుకోవడం లేదు. జరిమానా వేస్తామని టోల్‌ఫ్రీ నంబర్ నుంచి హెచ్చరికలు చేస్తున్నారు. ఈవిషయంపై బ్రాంచ్‌లో సంప్రదిస్తే సమాధానం లేదు. బ్రాంచ్‌లో సేవలు అందించేందుకు పూర్తి స్థాయిలో సిబ్బంది, అధికారులను నియమించాలి

-రఘునారెడ్డి, వ్యాపారి

ప్రాసల ఝురి.. మాటల సిరి

- వ్యాఖ్యాతగా రాణిస్తున్న సారం ప్రవీణ్ కుమార్
- జిల్లా నుంచి రాష్ట్ర స్థాయి వరకు వ్యాఖ్యానం
- తెలుగు భాషకు తన మాట, పాట ద్వారా చేయూత

హన్మకొండ : సభలోని ఆహుతులను తన మాటలతో ఆకట్టుకుని.. సందర్భానుసారం కవితలు, పాటల ద్వారా సభికులను ఉత్సాహపరచడం వ్యాఖ్యాత విధి. సాహితీ, కళా ప్రక్రియలో భాగమైన వ్యాఖ్యానానికి తనదైన శైలిలో న్యాయం చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నాడు సారం ప్రవీణ్ కుమార్. హనుమకొండ జిల్లా బాలల పరిరక్షణ విభాగంలో అధికారిగా పనిచేస్తూ ప్రవృత్తి పరంగా కవి, రచయిత, గాయకుడిగా, సాంస్కృతిక కార్యక్రమాలతో పాటు వ్యాఖ్యాతగా తన ప్రతిభ చాటుకుంటున్నాడు. వరంగల్ జిల్లా సంగెం మండలం కాట్రపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్ కుమార్.. సంగెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1991–9192 విద్యాసంవత్సరంలో 10వ తరగతి చదుకున్నాడు. అప్పుడే కళారంగంపై దృష్టి సారించాడు. అనంతరం వరంగల్‌లో ఇంటర్, డిగ్రీ, సోషల్ వర్క్‌లో పోస్టు గ్రాడ్యుయేషన్ పూర్తి చేశాడు. గ్రామ, మండల, జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో అనేక వేదికలపై జానపద, సామాజిక గీతాలు ఆలపించి అనేక ప్రశంసలు పొందాడు.

ప్రవీణ్‌పాటకు తొలి గురువులు తల్లిదండ్రులు..

ప్రవీణ్‌పాటకు తొలి గురువులు అతడి తల్లిదండ్రులు. ఆ తర్వాత మిత్రుడు చిలువేరు శ్రీనివాస్, సింగారపు బాబు, పర్కాల శ్యాంసన్, మెట్టుపల్లి మల్లయ్య, బొజ్జ సురేష్, మెట్టుపల్లి కొమురయ్య ప్రోత్సాహంతో సాంస్కృతిక రంగంలో రాణిస్తున్నాడు. పాటలు, కవితలు రాయడం, ప్రభుత్వ కార్యక్రమాలపై వ్యాసాలు రాయడం, పుస్తకాలకు సమీక్ష రాయడం తన ప్రవృత్తిలో భాగమైంది.



వ్యాఖ్యానం చేస్తున్న ప్రవీణ్

తొలుత పాటలకు కోరస్..

ప్రవీణ్ కుమార్ తొలుత పలు జానపద కళా బృందాలతో కలిసి వారు పాడిన పాటలకు కోరస్ పాడేవాడు. అనతి కాలంలో దివంగత వరంగల్ శంకర్, దీకొండ సారంగపాణి లాంటి గాయకులతో కలిసి అనేక సాంస్కృతిక కార్యక్రమాలలో తన గళం వినిపించాడు.

2018 నుంచి వ్యాఖ్యాత..

తెలుగు భాషపై మక్కువతో 2018 నుంచి ఉమ్మడి వరంగల్ జిల్లాలో ప్రభుత్వ కార్యక్రమమైనా, ఏదేని సాంస్కృతిక కార్యక్రమమైనా వ్యాఖ్యాతగా తన ప్రత్యేకత చాటుకుంటున్నాడు. ఇటీవల హైదరాబాద్ రవీంద్రభారతిలో కవుల సమక్షంలో చెత్త బండి దీర్ఘ కవిత సంపుటి ఆవిష్కరణ కార్యక్రమానికి వ్యాఖ్యాతగా వ్యవహరించారు. ప్రముఖ వ్యాఖ్యాతలు మఖ్దుమ్, మడిపల్లి దక్షిణమూర్తి, ప్రముఖ కవి అన్వర్ వ్యాఖ్యానంతో స్ఫూర్తిపొంది తన ప్రస్థానం కొనసాగిస్తున్నాడు.

బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్స విజయవంతం

- కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్

ఎంజీఎం : కాకతీయ మెడికల్ కళాశాల ప్రాంగణంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రిలో మొదటిసారి బ్రెయిన్ ట్యూమర్ శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్ దాస్ తెలిపారు. కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన బుర్ర స్వరూప ఈ నెల 11వ తేదీన న్యూరో సర్జరీ విభాగంలో అడ్మిట్ అయిందన్నారు. బ్రెయిన్‌లో ట్యూమర్ పెరగడంతో అధిక తలనొప్పి, నరాల బాధ పిట్స్‌తో బాధపడుతోందన్నారు. ఈ క్రమంలో 18వ తేదీన శస్త్రచికిత్స నిర్వహించి ప్రత్యేక అబ్జర్వేషన్‌లో ఉంచి మెరుగైన వైద్య చికిత్సలు అందించినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సను న్యూరోసర్జరీ విభాగాధిపతి మహ్మద్ సికిందర్, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ సచిన్, వీరేశ్, అనస్తీషియా వైద్యులు మురళి, చంద్రశేఖర్ నిర్వహించినట్లు తెలిపారు. ఈ శస్త్రచికిత్సకు ప్రైవేట్‌లో సుమారు రూ. 5 నుంచి రూ. 6 లక్షల వరకు ఖర్చు అవుతుందని తెలిపారు.



రోగితో వైద్య బృందం

సెల్‌ఫోన్‌కు మెసేజ్ పంపి.. ఇంటికి రప్పించి

- కూతురిని ప్రేమిస్తున్నాడనే అనుమానంతో యువకుడిపై దాడికి పాల్పడిన తండ్రి..

నర్సంపేట రూరల్ : కూతురిని ప్రేమిస్తున్నాడనే అనుమానంతో తండ్రి.. ఓ యువకుడిపై దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటన సోమవారం రాత్రి నర్సంపేటలో చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఏడుగురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ రమణామూర్తి మంగళవారం తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. సుమారు ఐదు సంవత్సరాల క్రితం నర్సంపేటకు చెందిన ఓ యువతి, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు మండలం చర్లపాలెం చెందిన ధర్మారపు ప్రకాశ్.. హనుకొండలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుకున్నారు. ఈ సమయంలో ఇద్దరు ప్రేమించుకున్నారు. తమ ప్రేమ విషయం ఇరువురు ఇళ్లలో చెప్పడంతో వారు అంగీకరించలేదు. పైగా గొడవలు జరిగాయి. ప్రకాశ్‌పై ఐదునెలల క్రితం నర్సంపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కౌన్సెలింగ్ నిర్వహించి పంపించారు. అప్పటి నుంచి ప్రేమికులు దూరంగానే ఉంటున్నారు. అయితే సదరు యువతి తండ్రి శ్రీనివాస్‌కు అనుమానం వచ్చింది. ఈనెల 24న తన కూతురి సెల్‌ఫోన్ నుంచి ఇంటికి రావాలంటూ ప్రకాశ్‌కు మెసేజ్ పంపించాడు. దీంతో రాత్రి 25 రాత్రి ప్రకాశ్.. యువతి ఇంటికి రావడంతో శ్రీనివాస్‌తోపాటు మరికొందరు కలిసి దాడి చేశారు. దీంతో ప్రకాశ్‌కు తీవ్రగాయాలయ్యాయి. వెంటనే హనుకొండలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ప్రకాశ్ తండ్రి ఉప్పలయ్య ఫిర్యాదు మేరకు శ్రీనివాస్‌తోపాటు ఏడుగురిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

30న కేయూ అకడమిక్ సెనెట్ సమావేశం



కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ 39వ అకడమిక్ సెనెట్ సమావేశం ఈ నెల 30న ఉదయం 11గంటలకు నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ పి.మల్లారెడ్డి మంగళవారం సర్క్యులర్ జారీ చేశారు. క్యాంపస్ పరిపాలన భవనంలోని సెనెట్‌హాల్‌లో జరగనున్న ఈ సమావేశానికి అకడమిక్ సెనెట్‌మెంబర్లు, డీన్‌లు, యూనివర్సిటీ కళాశాలల ప్రిన్సిపాళ్లు హాజరుకావాలని పేర్కొన్నారు. ఇందులో కేయూ బడ్జెట్‌ను కూడా ప్రవేశ పెట్టనున్నారు.

వేర్వేరు కారణాలతో నలుగురి మృతి

వేర్వేరు కారణాలతో ఉమ్మడి వరంగల్ జిల్లాలో నలుగురు మృతి చెందారు. దీంతో ఆయా కుటుంబాల్లో విషాదం నెలకొంది.

దుగ్గొండి: చెరువులో పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన దుగ్గొండిలో జరిగింది. మండల కేంద్రానికి చెందిన పర్లపెల్లి విజయ(45) సోమవారం సాయంత్రం బయటకు వెళ్లింది. రాత్రి అయినా ఇంటికి రాలేదు. ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో మంగళవారం మధ్యాహ్నం గ్రామ సమీపంలోని పెద్ద చెరువులో శవమై కనిపించింది. మృతురాలికి కుమారులు ప్రశాంత్, పవన్ ఉన్నారు.

తాటిచెట్టుపైనుంచి పడి గీత కార్మికుడు..



బక్కయ్య (ఫైల్)

తరిగొప్పుల: తాటి చెట్టుపై నుంచి జారిపడి ఓ గీత కార్మికుడు మృతి చెందాడు. ఈ ఘటన తరిగొప్పులలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన తాళ్లపల్లి బక్కయ్య (52) రోజు మాదిరిగా మంగళవారం ఉదయం కల్లు తీయడానికి చెట్టు ఎక్కాడు. ఈ క్రమంలో జారిపడగా తీవ్ర గాయాలయ్యాయి. దీంతో వెంటనే కుటుంబీకులు వరంగల్ ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ అదే రోజుమృతి చెందాడు.

చికిత్స పొందుతూ క్రీడాకారుడు..



శ్రీనివాస్ (ఫైల్)

కాజీపేట: ఈ నెల 24వ తేదీన జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ అంతర్జాతీయ క్రీడాకారుడు తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. కాజీపేట పట్టణానికి చెందిన నల్లెల శ్రీనివాస్ (47) ఫుట్‌బాల్, వాలీబాల్ క్రీడాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో రాణించి ఎన్నో అవార్డులు అందుకున్నారు. కొంత కాలంగా హైదరాబాద్‌లోని ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో కోచ్‌గా పని చేస్తున్నారు. ఈ క్రమంలో హసన్‌పర్తిలోని బంధువుల ఇంట్లో శుభకార్యం ఉండడంతో భార్య పద్మతో కలిసి హాజరయ్యారు. అనంతరం కాజీపేటకు వచ్చి రహమత్‌నగర్ చౌరస్తాలో తండ్రి వీరాస్వామిని కలిసి రోడ్డు క్రాస్ చేస్తుండగా ఆటో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ ఘటనపై మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శివకృష్ణ తెలిపారు.

ఏటూరునాగారంలో యువకుడు..



మణికుమార్(ఫైల్)

ఏటూరునాగారం : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపం చెందిన ఓ యువకుడు..ఆత్మహత్యకు యత్నించి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ కథనం ప్రకారం ఏటూరునాగారం మండల కేంద్రానికి చెందిన కుమ్మరి సమ్మయ్య, సమ్మక్క దంపతుల కుమారుడు మణికుమార్ (20) ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ జీవిస్తున్నాడు. మండల కేంద్రానికి చెందిన కొండాయి సంధ్యను ప్రేమ వివాహం చేసుకున్నాడు. అయితే కొన్ని రోజుల నుంచి దంపతుల మధ్య గొడవలు జరుగుతున్నాయి. దీంతో ఈనెల 23వ తేదీన సంధ్య పుట్టింటికి వెళ్లింది. మణికుమార్ అత్తగారి ఇంటికి వెళ్లి కాపురానికి రావాలని సంధ్యను కోరగా ఆమె తల్లిదండ్రులు నిరాకరించారు. దీంతో మణికుమార్ మనస్తాపం చెంది ఈనెల 24వ తేదీ తెల్లవారుజామున పురుగుల మందు తాగాడు. చికిత్స నిమిత్తం ఏటూరునాగారం తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో సోమవారం ములుగుకు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. కాగా, మృతుడు సూసైట్ నోట్ జేబులో పెట్టుకోవడం గమనార్హం. ఈ ఘటనపై మృతుడి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రక్తదానం.. సామాజిక సేవ

- కేయూ వీసీ తాటికొండ రమేష్

కేయూ క్యాంపస్ : రక్తదానం.. ఇతరులకు ప్రాణదానమని, ఇది సామాజిక సేవా కార్యక్రమమని కాకతీయ యూనివర్సిటీ వీసీ తాటికొండ రమేష్ అన్నారు. మంగళవారం హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్‌కళాశాలలో జాతీయ సేవాపథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో రక్తదానం శిబిరం నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేయడం వల్ల అత్యవసర పరిస్థితులు, తలసేమియా బాధితులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ జ్యోతి మాట్లాడుతూ తలసేమియా బాధితులకు నిత్యం రక్తం అవసరం ఉంటుందన్నారు. వారి కోసం ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కేయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, ఆ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పుల్లా శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ చందులాల్, డాక్టర్ శ్రీనివాస్ , అధ్యాపకులు డాక్టర్ ఆదిరెడ్డి, డాక్టర్ అంజన్‌రావు, డాక్టర్ శ్రీధర్‌కుమార్‌లోథ్, డాక్టర్ సంజీవ పాల్గొన్నారు. కాగా, 80 మంది విద్యార్థులు, పలువురు అధ్యాపకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో హనుమకొండ రెడ్‌క్రాస్ చైర్మన్ డాక్టర్ పి విజయ్‌చందర్‌రెడ్డి, పాలకవర్గసభ్యులు ఈ వి శ్రీనివాస్‌రావు, మాంగళిశేషుమాధవ్, పొట్లపెల్లి శ్రీనివాస్‌రావు,బిల్ల రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రక్తదానం చేసిన విద్యార్థులకు వీసీ రమేష్ సర్టిఫికెట్లు అందజేశారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ రమేష్, పక్కన ప్రిన్సిపాల్ జ్యోతి తదితరులు

రామేశ్వరానికి అభినందన

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం రిటైర్డ్ ప్రొఫెసర్, నేచురోపతి లైబ్రరీ అండ్ రీసెర్చ్‌సెంటర్ వ్యవస్థాపకుడు గజ్జల రామేశ్వరంను కేయూ వీసీ తాటికొండ రమేష్ మంగళవారం తన చాంబర్‌లో అభినందించారు. న్యూఢిల్లీలోని జేఎన్‌యూలో ఈనెల 18నుంచి 20వ తేదీ వరకు జరిగిన 8వ వరల్డ్ క్యాన్సర్ కాంగ్రెస్ 2024లో ఆచార్య రామేశ్వరం పాల్గొన్నారు. 'నేచర్‌క్యూర్ మెథడ్స్ ఇన్‌ది మేనేజ్‌మెంట్ ఆఫ్ క్యాన్సర్ టూ సెంచరీస్ హిస్టారికల్ ఎవిడెన్స్ ఆఫ్‌ది వరల్డ్' అనే అంశంపై పరిశోధన పత్రం సమర్పించారు. ఈ అంశంలో సర్టిఫికెట్ పొందిన రామేశ్వరంను వీసీ రమేష్ అభినందించారు. కార్యక్రమంలో కేయూ రిటైర్డ్ ప్రొఫెసర్ సత్యనారాయణ పాల్గొన్నారు.



బ్రహ్మచారి మృతదేహం లభ్యం

హసన్‌పర్తి : గుండ్లసింగారం సమీపంలోని ఎస్సారెస్పీ కాల్వలో గల్లంతైన కమలాపూర్ మండలం శ్రీరాముపల్లికి చెందిన రాపాక బ్రహ్మచారి(40) మృతదేహాన్ని మంగళవారం పోలీసులు కనుగొన్నారు. సంగెం మండలం తీగరాజుపల్లిలోని ఎస్సారెస్పీ కెనాల్‌లో మృతదేహం లభ్యమైంది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. అయితే కేసు కేయూసీలో నమోదు కావడంతో ఇక్కడి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఎంజీఎంకు తరలించినట్లు ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

PLOT FOR SALE

GWMC & KUDA అప్రూవ్డ్ లే అవుట్ చింతగట్టు హన్మకొండలో అన్ని అభివృద్ధి పనులతో ప్లాట్లు అమ్మబడును, కేవలం 15000/-లకు గజం మాత్రమే. వివరాలకు సంప్రదించండి. 9849992488. [W-1264863]

SERVICES

శ్రీశైలీ బ్యూటీపార్లర్ ఉచిత శిక్షణ

హన్మకొండలోని శ్రీశైలీ బ్యూటీపార్లర్‌లో ST మహిళలు & అన్ని వర్గాల మహిళలకు ఉచిత బ్యూటీషియన్ శిక్షణ ఇవ్వబడును. మొదటి 60 మందికి మాత్రమే. సంప్ర: 9989060668. [WA-5891]

WANTED

యువరాజ్ కిరాణంలో పనిచేయుటకు కిరాణంలో 1 సం॥ చేసిన అనుభవం గల యువతీ, యువకుడు కావలెను. ఆకర్షణీయమైన జీతం. వరంగల్ లోకల్ వారికి మాత్రమే. సంప్ర॥ అండర్ బ్రిడ్జి దగ్గర, వరంగల్. 9490133696. [WA-7503]

ప్రముఖ కంపెనీలో పార్ట్ టైం మాన్యువల్ రైటింగ్ వర్క్ చేయుటకు స్త్రీ/పురుషులు కావలెను. వీక్లీ పేమెంట్స్ కలవు. మీ పేరు, అడ్రస్ కాల్ / వాట్సప్ చేయగలరు. 9059663584, 9502615217. [M-1185002]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారానికి 3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. సంప్ర. 9573633520, 8919739694. [M-1233956]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి

హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రత్యుత్తరమివ్వాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.